రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా ముందుగా కుదుపులకు లోనవుతున్నది రెవెన్యూ శాఖలోని గ్రామ స్థాయి రెవెన్యూ పరిపాలన వ్యవస్థ. ఉమ్మడి రాష్ట్రంలో మాజీ సీఎంలు ఎన్టీఆర్ మొదలుకొని, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు, తాజాగా కేసీఆర్ పాలనలో వేర్వేరు పేర్లతో కొనసాగిన గ్రామ కరణాలు, పటేల్ పట్వారీలు, వీఆర్వో వ్యవస్థలను రద్దు చేయడంతో ప్రజలు, సంబంధిత ఉద్యోగులకు కూడా తీవ్ర అన్యాయం చేశారనే చర్చ ఉన్నది. గ్రామ రెవెన్యూ వ్యవస్థని రద్దు చేసిన ప్రతీ ప్రభుత్వం కూడా వెంటనే తర్వాతి ఎన్నికల్లో తీవ్ర పరాజయం చవి చూడటం ఒక ఆనవాయితీగా మారింది. మమ్మల్ని జూనియర్ అసిస్టెంట్ తత్సమాన పోస్టుల్లో నియమించాల్సి ఉండగా, కొన్ని ప్రభుత్వ శాఖలలో శాంక్షన్లు పోస్టులు లేక "తోటమాలి / వార్డ్ ఆఫీసర్/ రికార్డ్ అసిస్టెంట్/ స్టోర్ కీపర్/ కంప్యూటర్ ఆపరేటర్/ అటెండర్/ జీపు డ్రైవర్/ రేషన్ డీలర్/ హాస్టల్ వర్కర్ /వాచ్-మెన్" వంటి తక్కువ స్థాయి పోస్టుల్లో నియమించారు. రెవెన్యూ శాఖలోని మా గత 6-24 ఏళ్ల ఉద్యోగ అనుభవాన్ని పరిగణించి మా మాతృ శాఖ రెవెన్యూలోకి "ఆప్షన్లు/ కౌన్సెలింగ్" ద్వారా వెనక్కి రప్పించి, సర్వీస్-పే ప్రొటెక్షన్ కల్పించి, కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు కల్పించి, రెవెన్యూ శాఖ బలోపేతం చేయడంతో పాటు... మా సర్వీస్ మ్యాటర్ల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరి కారణంగా దీర్ఘ కాలికంగా నష్టపోయిన మా ఉద్యోగ జీవితాలకు ప్రస్తుత కాంగ్రెస్ సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ద్వారా తగు సత్వర న్యాయం చేయాలని.. వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేందర్ కోరారు. వీఆర్వోలు పడుతున్న ఇబ్బందులు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై కెరటం ప్రతినిధితో ముచ్చటించారు. ఆయన తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే..



# ఎన్నాళ్లు..! కన్నీళ్లు...?

వీఆర్వో వ్యవస్థ రద్దుతో రెవెన్యూ చిన్నాభిన్నం

అటెండర్, తోటమాలి, మహిళా జీప్ డ్రైవర్, వంట మనిషిగా నియామకం

## వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేందర్

- 6-24 ఏళ్ల సర్వీసున్నా ఇతర శాఖలలో సీనియారిటీ సున్నా
- అటెండర్, తోటమాలి, మహిళా జీప్ డ్రైవర్, వంట మనిషిగా నియామకం
- భద్రాద్రి జీసీసీలో 22 నెలలుగా వేతనాలు లేవు
- ఉద్యోగ భద్రత, పదోన్నతులు కరవై తీవ్ర ఆందోళన
- ఆంధ్రాలో గ్రామ సచివాలయ వ్యవస్థ విజయవంతం
- తెలంగాణ పల్లెల్లో ప్రతీ భూసమస్యకీ హైదరాబాద్ పట్నం పోవాల్సిందే!
- ధరణి పోర్టలుతో హైదరాబాదులో అధికారాల కేంద్రీకరణ ఫలితం
- బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నష్టానికి కాంగ్రెస్ పరిష్కారం చూపేనా?

**ధరణి ఆగమనంతో అంతా ఆగమాగం..**

గత కేసీఆర్ ప్రభుత్వం ఏకకాలంలో తహశీల్దార్ కార్యాలయంలోనే "ఆన్లైన్ రిజిస్ట్రేషన్, పట్టా మార్పిడి (మ్యూటేషన్)" సేవల కోసం అక్టోబర్ 29, 2020న "ధరణి" పేరుతో కొత్త పోర్టల్ తీసుకొచ్చినా ఆశించిన సత్ఫలితాలు రాలేదు. అధికారాలు మొత్తం హైదరాబాద్ సీసీఎల్ఏ స్థాయిలో కేంద్రీకృతం చేసి గుప్పిట బిగించడం, దానికి తోడు గ్రామ స్థాయిలో రెవెన్యూ పాలనకి వెన్నెముకగా ఉన్న "గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థ రద్దు చట్టం, 2020" ద్వారా అందులోని ఉద్యోగులు అందరినీ ఏకపక్షంగా రద్దు చేయడం మరిన్ని సమస్యలకు ఆజ్యం పోసినట్టయింది. దీంతో ప్రతీ చిన్న సమస్యకి కూడా మీసేవ ద్వారా ప్రతీసారి రూ.1000కి పైగా అదనపు ఛార్జీలు చెల్లించి ఆన్లైన్లో అర్జీ చేసుకుంటే హైదరాబాద్లోని ఆ విభాగం సీసీఎస్ఏ ప్రతీ అర్జీని ఆమోదిస్తే గానీ సరిచేయలేని దుస్థితి.



ఫలితంగా జిల్లాల కలెక్టర్లు సైతం సాధారణ పరిపాలనపై దృష్టి పెట్టలేని దుస్థితి దాపురించింది.

**అడ్డగోలుగా వీఆర్వో వ్యవస్థ రద్దు!**

రెవెన్యూ శాఖలో 6-24 ఏళ్ల ఉద్యోగ అనుభవం కలిగి, ప్రతీ సందర్భంలో ఎన్నో కష్ట నష్టాలు, వ్యయ ప్రయాసలకి ఓర్చి, 24 గంటలూ ప్రభుత్వం- ప్రజల మధ్య వారధిగా ఉన్న పూర్వ వీఆర్వోలను గత బిఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ఏకపక్షంగా, నియంతృత్వంగా "తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికార వ్యవస్థ రద్దు చట్టం, 2020" ద్వారా రెవెన్యూ శాఖ నుంచి తప్పించింది. తత్ఫలితంగా సుమారు 7,000 పైచిలుకు పోస్టులు రద్దవడమే కాకుండా.. 5,138 మంది పూర్వ వీఆర్వోల ఉద్యోగ జీవితాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అలాగే ఆ చట్టంలోని - 4(1)" ... జీ ఓ. 121, 3, 23.07.2022 తీసుకొచ్చి, ఆగస్టు 01, 2022 నాడు "రీడెప్లాయిమెంట్" పేరుతో "లాటరీ విధానం"లో ఇతర శాఖల్లోకి బలవంతంగా బదిలీ చేస్తూ... అర్ధరాత్రి సమయంలో ఆర్డర్లు చేతిలో పెట్టి, మా ఉద్యోగ జీవితాలకు ఉరి వేసి, కుటుంబాలను భయకంపితులను చేసి కుంగదీశారు. దీంతో తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఏ శాఖ ఉద్యోగీ ఇంతగా వేదన అనుభవించి ఉండరు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన 5శాతం ఐ ఆర్ పెంపుదలకు అర్హులు కావడం లేదు. మా కుటుంబాలకు కారుణ్య నియామకాల వెసులుబాటు లేదు. ఆరోగ్యం, పిల్లల చదువుల విషయమై రాయితీ పొందే సౌకర్యం కోల్పోయాం. పాత డీఏ, పీ అర్ సీ, ఇతర బకాయిలు రావడం లేదు. సొసైటీలు, కార్పొరేషన్లలో బడ్జెట్ మేరకు 3 నెలలకోసారి వేతనాలు చెక్కుల రూపంలో ఇస్తున్నారు. భద్రాద్రి జీసీసీలో (16) మందికి గత (22) నెలలుగా వేతనాలు లేవు. దీర్ఘ కాలిక సమస్యల కారణంగా శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులమైన మా పూర్వ వీఆర్వోలం... వ్యవస్థ రద్దు కారణంగా, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరి కారణంగా ఆర్థికంగా, సర్వీసు పరంగా తీవ్ర నష్టపోయి, మానసిక సంఘర్షణకు లోనవుతూ, ఆరోగ్యం దెబ్బతింటున్నది.

**మా ఉద్యోగ జీవితాలకు తగు సత్వర న్యాయం చేయాలి..**

ప్రస్తుత ప్రజా తెలంగాణ ప్రభుత్వ పాలన రథసారథులు ఒకసారి దృష్టి సారించి మా సమస్యల పట్ల సానుకూల సత్వర పరిష్కారం చూపగలరని ఆర్థిస్తున్నాం. కావున రెవెన్యూ శాఖలోని మా గత 6-24 ఏళ్ల ఉద్యోగ అనుభవాన్ని పరిగణించి మా మాతృ శాఖ రెవెన్యూలోకి "ఆప్షన్లు/ కౌన్సెలింగ్" ద్వారా వెనక్కి రప్పించి, సర్వీస్-పే ప్రొటెక్షన్ కల్పించి, కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు కల్పించి, రెవెన్యూ శాఖ బలోపేతం చేయడంతో పాటు... మా సర్వీస్ మ్యాటర్ల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరి కారణంగా దీర్ఘ కాలికంగా నష్టపోయిన మా ఉద్యోగ జీవితాలకు ప్రస్తుత కాంగ్రెస్ సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ద్వారా తగు సత్వర న్యాయం చేయించి అండగా నిలవగలరని ధరణి కమిటీ బాధ్యులను సవినయంగా కోరి ప్రార్థిస్తున్నాము.